నులిపురుగుల నివారణకు మాత్రల పంపిణీ

కలెక్టర్ వల్లూరు క్రాంతి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 6 : జిల్లాలో నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్య శాఖతో పాటు అన్ని శాఖలు సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమాశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ వంద శాతం పూర్తయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలో 4,05,207 మంది పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలనే లక్ష్యంతో అధికారులు కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ఈ నెల 10న ప్రారంభమయ్యే మాత్రల పంపిణీ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సంక్షేమ హాస్టళ్లలో డివార్మింగ్ ట్యాబ్లెట్లు పంపిణీ పూర్తయ్యేలా చూడాలన్నారు. 1 నుంచి 19 ఏండ్ల వయస్సు ఉన్న పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయాలని సూచించారు. జీహెచ్‌ఎంసీ, అర్బన్ ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈనెల 17న చివరి విడతగా మాత్రల పంపిణీ ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ గాయత్రీదేవి, జడ్పీ సీఈవో జానకిరెడ్డి, డీపీవో సాయిబాబా, డీఈవో వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

అనంతరం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, విద్యుత్ శాఖల అధికారులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సీడీపీవోలతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ భవనాలు, మరుగుదొడ్ల పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇకపై అలా చేస్తే చర్యలు తప్పవన్నారు. నారాయణఖేడ్ మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన సంఘటన మరెక్కడ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి లలితా కుమారి, జడ్పీ సీఈవో జానకిరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్వోసీ అందజేత

చింతల్‌ఘాట్ గ్రామానికి చెందిన బాధిత కుటుంబానికి ఎల్వోసీని అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

కోహీర్, ఫిబ్రవరి 6 : మండలంలోని చింతల్‌ఘాట్ గ్రామానికి చెందిన నవీన్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు గురువారం జహీరాబాద్ క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబానికి సీఎం సహాయనిధి నుంచి రూ. 2 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామకమిటీ అధ్యక్షుడు సాలోమన్ ఉన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు

గృహ నిర్మాణ శాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ చలపతి

న్యాల్‌కల్‌లో లబ్ధిదారుల ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న డైరెక్టర్ చలపతి

జహీరాబాద్, ఫిబ్రవరి 6 : అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు దక్కేలా చర్యలు తీసుకుంటామని జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ చలపతి అన్నారు. గురువారం మండల కేంద్రమైన న్యాల్‌కల్ గ్రామంలో సొంత ఇంటి స్థలం ఉండి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునేందుకు అవకాశం ఉన్న లబ్ధిదారుల నివాస ఇంటి పరిసరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి విడతలో సొంత ఇంటి స్థలం ఉన్న లబ్ధిదారులు ఇండ్లను నిర్మించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. గ్రామంలోని సొంత ఇంటి స్థలం ఉండి నిర్మించుకునేందుకు అర్హత ఉన్న లబ్ధిదారులను మొదట ఎంపిక చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనర్హులకు ఎంపిక చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట మండల అభివృద్ధి అధికారి రాజశేఖర్, పీఏసీఎస్ చైర్మన్ సిద్ధిలింగయ్య స్వామి, పంచాయతీ కార్యదర్శి ధన్‌రాజ్ తదితరులు ఉన్నారు.

దవాఖాన సిబ్బందికి వేతనాలు చెల్లించాలి

జోగిపేట సూపరిండెంటెండ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

అందోల్, ఫిబ్రవరి 6 : ప్రభుత్వ దవాఖానలో పనిచేస్తున్న సిబ్బందికి 2 నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట్‌రాజ్యం, ఏఐటీయూసీ జిల్లా నాయకులు చిరంజీవి డిమాండ్ చేశారు. గురువారం జోగిపేటలో ప్రభుత్వ దవఖానలో పనిచేసే సిబ్బంది పెండింగ్ వేతనాలు త్వరగా చెల్లించేలా చూడాలని సూపరిండెంటెండ్ సౌజన్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ దవఖానల్లో పనిచేస్తున్న కింది స్థాయి సిబ్బందికి 2 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో వారు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. జోగిపేటలో సైతం రెండు నెలలుగా వేతనాలు రాక సిబ్బంది ఇబ్బంది పడుతున్న కాంట్రాక్టర్, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం సరైన పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రావణి, నాగరాజు, రాణి, లక్ష్మి, హరి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

రాయికోడ్, ఫిబ్రవరి 6 : ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్‌లో అపోలో చిక్సిత పొందుతున్న మండల బీఆర్‌ఎస్ నాయకుడు గోపాల్‌ను గురువారం అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని అండగా ఉంటామన్నారు. ఆయనవెంట నేత రాములు ఉన్నారు.

గోపాల్‌ను పరామర్శిస్తున్న అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

హెచ్‌ఎండీఏ పేరుతో ఘరానా మోసం

అండూర్ శివారులోని ఒంగోని కుంట కట్టకు తవ్వి పాట్లు చేసిన రియల్ వ్యాపారులు

జిన్నారం, ఫిబ్రవరి 6 : మండలంలోని అండూర్ గ్రామంలో రియల్ వ్యాపారులు అమాయక ప్రజలను మోసం చేసుకుంటూ హెచ్‌ఎండీవే పేర్లతో ప్లాట్లు వేసి గ్రామపంచాయతీ ఆదాయానికి గండికొడుతూ రియల్ వ్యాపారస్తులు జేబులు నింపుకొంటున్నారని మత్స్యకారులు మండిపడ్డారు. ఒంగోనికుంట కట్టను కూల్చి ప్లాట్లుగా మార్చిన విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న ప్లాట్లను తొలిగించి పంచాయతీ ఆదాయాన్ని కాపాడాలని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను ఆగ్రామస్తులు కోరుకుంటున్నారు.

పాల ట్యాంకర్ బైక్ ఢీ .. ఒకరికి తీవ్రగాయాలు

కల్హేర్, ఫిబ్రవరి 6 : రోడ్డుపై ఎదురెదురుగా ప్రయాణిస్తున్న పాల ట్యాంకర్ బైక్ ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన కల్హేర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట్ మండలం బాచేపల్లి గ్రామానికి చెందిన బేగరి దానయ్య (28) నారాయణఖేడ్ నుంచి నిజాంపేట్ వస్తున్నారు. ఇదే క్రమంలో హైదరాబాద్ నుంచి నారాయణఖేడ్ వైపు పాల ట్యాంకర్ వెళ్తుం ది. మునిగేపల్లి గ్రామ చౌరస్తా సమీపంలోకి రాగానే పాల ట్యాంకర్ బైక్‌లు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో బేగరి దానయ్యకు తీవ్ర గాయాలైయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని దానయ్యను నారాయణఖేడ్‌లోని సర్కార్ దవాఖానకు తరలించగా వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డికి తరలించారు.

తెలంగాణ గ్రామీణ బ్యాంక్

ప్రధాన కార్యాలయం: హైదరాబాద్ | ప్రాంతీయ కార్యాలయం: సంగారెడ్డి

శాఖ: నారాయణఖేడ్ శాఖ (8157)

స్వాధీనతా ప్రకటన (లాంఛనప్రాయ స్వాధీనం)

{రూల్ 8(1) మరియు (2) క్రింద} (స్థిరాస్తి కొరకు)

దిగువ సంతకందారు **తెలంగాణ గ్రామీణ బ్యాంక్, గతంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, నారాయణఖేడ్** (8157) యొక్క అధీకృత అధికారిగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి రుణగ్రహీత: **శ్రీ అబ్దుల్ రహమత్ తండ్రి మజీద్**, చిరునామా: ఇం.నెం.1-2-26/1, అశ్మి స్ట్రీట్, నారాయణఖేడ్ (మం), సంగారెడ్డి (జి)-502286, **హౌసింగ్ లోన్ అకౌంట్ నెం.73151060500- మంజూరుచేయబడిన పరిమితి- రూ.5,00,000/-, టాప్‌అప్ లోన్ అకౌంట్ నెం.73197821509- మంజూరైన పరిమితి- రూ.13,00,000/-** వారికి **31-07-2024** తేదీగల డిమాండ్ నోటీసు జారీ చేసి, సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా నోటీసులో తెలిపిన మొత్తం 31.07.2024 నాటికి హౌసింగ్ లోన్ **రూ. 3,85,308/- (మూడు లక్షల ఎనభై ఐదు వేల మూడు వందల ఎనిమిది రూపాయలు మాత్రమే) మరియు టాప్‌అప్ లోన్** 31.07.2024 **నాటికి రూ.13,11,744 (పదమూడు లక్షల పదకొండు వేల ఏడు వందల నలభై నాలుగు రూపాయలు మాత్రమే), మొత్తం రూ.** 3,85,308/- + **రూ.**13,11,744/-= 31.07.2024 **నాటికి రూ.**16,97,052/- **(పదహారు లక్షల తొంభై ఏడు వేల యాభై రెండు రూపాయలు మాత్రమే)** లను తిరిగి చెల్లించాల్సిందిగా కోరుతున్నారు.

సదరు డిమాండ్ నోటీస్ జారీచేసిన తర్వాత కూడా రుణగ్రహీత/హామీదారు మిగిలిన మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలం కావడం చేత సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదవబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించి దిగువ సంతకందారు దిగువ వివరించబడిన ఆస్తిని **01.02.2025న** స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీత/హామీదారు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా తెలియజేయడమైనది.

సదరు ఆస్తితో ఏ విధమైన లావాదేవీ నిర్వహించరాదని మరియు సదరు ఆస్తితో నిర్వహించబడు ఏవేని లావాదేవీలు 31.07.2024 నాటికి హౌసింగ్ లోన్ **రూ. 3,85,308/- (మూడు లక్షల ఎనభై ఐదు వేల మూడు వందల ఎనిమిది రూపాయలు మాత్రమే) మరియు టాప్‌అప్ లోన్** 31.07.2024 **నాటికి రూ.13,11,744 (పదమూడు లక్షల పదకొండు వేల ఏడు వందల నలభై నాలుగు రూపాయలు మాత్రమే), మొత్తం రూ.** 3,85,308/- + **రూ.**13,11,744/-= 31.07.2024 **నాటికి రూ.**16,97,052/- **(పదహారు లక్షల తొంభై ఏడు వేల యాభై రెండు రూపాయలు మాత్రమే)** మరియు 01.08.2024 నుండి దానిపై వడ్డీ, ఖర్చుల మొత్తం కొరకు **తెలంగాణ గ్రామీణ బ్యాంక్, గతంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, నారాయణఖేడ్** (8157) చార్జ్‌కు లోబడి వుంటాయని ప్రత్యేకించి రుణగ్రహీత/హామీదారు మరియు సాధారణ ప్రజానీకాన్ని ఇందుమూలముగా హెచ్చరించడమైనది.

స్థిరాస్తి వివరణ

సబ్ రిజిస్ట్రేషన్ నారాయణఖేడ్, రిజిస్ట్రేషన్ జిల్లా సంగారెడ్డి, సంగారెడ్డి జిల్లా, నారాయణఖేడ్ వద్ద గల గ్రౌండ్ మరియు మొదటి అంతస్తులో 897.00 చ.అ. బిల్టప్ ఏరియాతో సహా 75.00 చ.గజాలు విస్తీర్ణం భూమి, శాస్త్రి నగర్, ఇం.నెం. 1-2-29/1 (ఇం.నెం.1-2-27/1-పాతది) కలిగిన ఇల్లు యావత్తు, **ఆస్తి సరిహద్దులు: ఉత్తరం:** బాబురావు ఖాళీ ప్లాట్, **దక్షిణం:** మజీద్ ఇల్లు, **తూర్పు:** జి.పి.రోడ్, **పడమర:** ఎమ్.ఎ.మజీద్ ఇల్లు.

తేది: 01-02-2025, ప్రదేశం: నారాయణఖేడ్ | సం/- అధీకృత అధికారి, తెలంగాణ గ్రామీణ బ్యాంక్

టీవీఎస్ షోరూమ్‌ని ప్రారంభించిన మాజీ మంత్రి

అర్జున్ టీవీఎస్ షోరూం ప్రారంభోత్సవంలో మాజీ మంత్రి హరీశ్‌రావు

రామచంద్రాపురం, ఫిబ్రవరి 6 : ఆర్సీపురం డివిజన్‌లోని జ్యోతినగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అర్జున్ టీవీఎస్ షోరూమ్‌ని గురువారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో షోరూం యజమాని విశ్వనాథ్‌రెడ్డి, టీవీఎస్ మోటర్ కంపెనీ జీఎం కెంద్రాజ్‌జోషి, ఏరియా సెల్స్ మేనేజర్ విశాల్‌విక్రమ్‌సింగ్, సర్వీస్ మేనేజర్ వరుణ్‌గుప్తా, కార్పొరేటర్ మెట్టు కుమార్, బీఆర్‌ఎస్ నేతలు ఆదర్శ్‌రెడ్డి, కుమార్‌గౌడ్, నర్సింహ, రాజేశ్ గౌడ్, మాణిక్ యాదవ్, కృష్ణకాంత్, సత్యనారాయణ, దేవేంద్రాచారి, జగన్నాథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీలో విజేతగా 'సెయింట్ అంథోనీస్'

విజేతలను అభినందిస్తున్న పాఠశాల చైర్మన్ ఆంథోనీరెడ్డి

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 6 : స్థానిక విద్యానగర్ సెయింట్ అంథోనీస్ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. ఈ మేరకు గురువారం స్థానిక పాఠశాలలో సెయింట్ అంథోనీస్ పాఠశాల చైర్మన్ అంథోనీరెడ్డి, ప్రిన్సిపాల్ ప్రమీల విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మహబూబాబాద్‌లో టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-14 రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీలో బాలురు, బాలికల విభాగంలో ఆంధ్రప్రదేశ్ జట్టుతో తలపడి తెలంగాణ జట్టు తరఫున తమ పాఠశాల విద్యార్థులు ట్రోఫీని గెలుచుకున్నారని వివరించారు. విజేతలు న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి క్రికెట్ టోర్నీలో పాల్గొననున్నట్లు వెల్లడించారు. కోచ్ కరుణాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్వేతో ఏఈవోలకు ఇబ్బందులు

పైడిగుమ్మల్‌లో చేపట్టిన సర్వేను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి నవీన్‌కుమార్

కోహీర్, ఫిబ్రవరి 6 : కోహీర్, దిగ్వాల్, నాగిరెడ్డిపల్లి, గొటిగార్‌పల్లి, పైడిగుమ్మల్, బిలాల్‌పూర్ గ్రామాల్లో గురువారం చేపట్టిన పంటల నమోదు సర్వేతో ఏఈవోలు ఇబ్బందులు పడ్డారు. ఆయా గ్రామాల్లోని రెండు వేల ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. కానీ ఏఈవోలుగా మహిళలు అధికంగా ఉండడం, ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో పొలాలను సందర్శించేందుకు అవస్థలు పడుతున్నారు. సర్వే కోసం ఒంటరిగా పొలాలకు వెళ్లడం, అక్కడ వివరాలు తెలిపేందుకు రైతులు అందుబాటులో ఉండకపోవడంతో వారి కష్టాలు రెట్టింపయ్యాయి. రైతులు పండిస్తున్న పంటల వివరాలు, ఎకరాలు, ఎరువుల వినియోగం, సాగునీటి వనరులు, తదితర వివరాలను నమోదు చేయా ల్సి ఉన్నది. దీంతో వారు లోలోన బాధ పడుతూ సర్వేను నిర్వహిస్తున్నారు. పైడిగుమ్మల్‌లో నిర్వహిస్తున్న సర్వేను మండల వ్యవసాయాధికారి నవీన్ కుమార్ పరిశీలించారు.

మంత్రి వెంటనే రాజీనామా చేయాలి

జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ విజిలెన్స్ కమిటీ సభ్యుడు కాశపాగ ఇమ్మయ్య

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ విజిలెన్స్ కమిటీ సభ్యుడు కాశపాగ ఇమ్మయ్య

చౌటకూర్, ఫిబ్రవరి 6 : మాదిగలకు న్యాయం చేయని మంత్రి దామోదర రాజనరసింహ రాజీనామా చేయాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ విజిలెన్స్ కమిటీ సభ్యుడు కాశపాగ ఇమ్మయ్య, కాకతీయ యూనవర్సిటీ జేఏసీ నాయకుడు ఎర్రోల్ల పోచయ్య డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని తాడ్దానిపల్లి చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డితో చర్చలు జరిపిన మంత్రి దామోదర రాజనరసింహ రిజర్వేషన్ల అంశంపై గట్టిగా మాట్లాడలేదని ఆరోపించారు. మాదిగలపై మంత్రి దామోదర్ కపట ప్రేమ చూపిస్తున్నారని మండిపడ్డారు. మాదిగలకు న్యాయంగా రావాల్సిన రిజర్వేషన్ల కోటా అంశంపై మంత్రి దామోదర్ పట్టుబట్టకపోవడం వల్లనే 9 శాతం కేటాయించారని ఆరోపించారు. రాష్ట్రంలో 17 లక్షల జనాబా ఉన్న మాలలకు 5 శాతం రిజర్వేషన్లు ఇస్తే, 32 లక్షలకు పైగా జనాభా ఉన్న మాదిగలకు కేవలం 9 శాతం కేటాయించడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. మంద కృష్ణ నాయకత్వంలో రాష్ట్రం నడిబొడ్డున లక్ష డప్పులు, వేల గొంతులు కార్యక్రమానికి పిలుపునివ్వడంతో ప్రభుత్వం దిగివచ్చి వర్గీకరణ చేపట్టిందన్నారు. అసంబద్ధమైన వర్గీకరణను సరిచేసి మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని, అందుకు మరో ఉద్యమానికి నాంది పలుకుతామని హెచ్చరించారు. కాగా, గత జూలై మాసంలో గంగోజీపేట, గొంగ్లూరు గ్రామాలకు చెందిన ముగ్గురు యువకులు రోడ్డు ప్రమాదంలో మరణిస్తే వారి కుటుంబాలను మంత్రి దామోదర్ పరామర్శించకపోవడం విచారకరమన్నారు.

కులగణనతో బీసీలను అణిచివేసే కుట్ర



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ నేతలు

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 6 : కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన పేరుతో బీసీలను అణిచివేసే కుట్రకు తెరలేపిందని తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దొనె అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దిపేటలో గురువారం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్ చేసిన కులగణనను బీసీలు అంగీకరించరన్నారు. రేవంత్‌రెడ్డి కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో ఏవిధంగానైతే బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీ ఇచ్చారో అదేవిధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. తప్పుల తడకగా కులగణన చేసిన ప్రభుత్వం బీసీలకు తక్షణమే క్షేమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సురేశ్, ప్రశాంత్, వెంకటేశ్, రంజిత్‌గౌడ్, కొమురయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బాలికలను ప్రోత్సహించాలి

మున్సిపల్ కార్యాలయం వద్ద 'బేటిబచావో బేటి పడావో'లో పాల్గొన్న అధికారులు

అందోల్, ఫిబ్రవరి 6 : బాలికలు ఉన్నత విద్యను అభ్యసించేలా తల్లితండ్రులు ప్రోత్సహించాలని ఆర్డీవో పాండు అన్నారు. గురువారం జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అందోల్‌లో 'భేటీ బచావో భేటీ పడావో' కార్యక్రమాన్ని నిర్వహించి బాలికల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికలు బాగా చదువుకోవాలని, చదువు ద్వారానే ఏదైనా సాధించవచ్చన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని పుస్తకపఠనం అలవాటు చేసుకోవాలన్నారు. సమాజంలో జరుగుతున్న విషయాలను తెలుసుకోవాలని మహిళా చట్టాలు ఇతర అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం 'బేటి బచావో..బేటి పడావో'పై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి, తహసీల్దార్ విష్ణుసాగర్, మహిళా సాధికరత కేంద్రం సమన్వయ కర్త పల్లవి, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగు లాభదాయకం

గోవింద్‌పూర్‌లో మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవన శాఖాధికారి సోమేశ్వర్‌రావు

జహీరాబాద్, ఫిబ్రవరి 6 : యాజమాన్య పద్ధతులతోనే మామిడి, ఆయిల్‌పామ్ సాగులో అధిక దిగుబడులను సాధించేందుకు అవకాశం ఉంటుందని జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖాధికారి సోమేశ్వర్‌రావు, వ్యవసాయాధికారి శివప్రసాద్ అన్నారు. గురువారం జహీరాబాద్ మండలంలోని గోవీంద్‌పూర్‌లో ఏర్పాటు చేసిన మామిడి, ఆయిల్‌పామ్ సాగు అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చీడపురుగుల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. రైతులు ఆయిల్ పామ్ పంటలపై అసక్తి పెంచుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త శ్యామల, ఆయిల్ పామ్ గోద్రేజ్ జిల్లా మేనేజర్ కొండల్‌రావు, ఉద్యానవన శాఖాధికారి పండరీ, రైతులు పాల్గొన్నారు.

పాఠశాల ఎదుట విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

జహీరాబాద్ పట్టణ సమీపంలో పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

జహీరాబాద్, ఫిబ్రవరి 6 : పట్టణంలోని శ్రీకృష్ణవేణి పాఠశాల ఎదుట గురువారం విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. స్థానిక పట్టణంలోని పాఠశాలలో అర్హత లేని ఉపాధ్యాయులతో విద్యను బోధించడంతో విద్యార్థులకు ఇంగ్లిష్, తెలుగు సబ్జెక్టులతో పాటు ఇతర సబ్జెక్టు చదవడం, రాయడం కూడా కనీసం రావడం లేదని తల్లిదండ్రులు వాపోయారు. అధిక ఫీజు తీసుకోవడమే తప్ప పాఠశాలలో కనీస సౌకర్యాలను కల్పించకపోవడంతో విద్యార్థులుప తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యాజమాన్యంపై ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

తప్పుల తడకగా బీసీ కులగణన

రాష్ట్ర ఎస్సీ కులాల సహకార అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఏర్పుల నరోత్తం

మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ కులాల సహకార అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్

జహీరాబాద్, ఫిబ్రవరి 6 : కుల గణన పేరుతో ప్రభుత్వం బీసీలకు అన్యాయం జరిగే సహించేది లేదని రాష్ట్ర ఎస్సీ కులాల సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఏర్పుల నరోత్తం అన్నారు. గురువారం జహీరాబాద్ పట్టణంలో ఆయన విలేకరలతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బోగస్ కులగణన బీసీలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తుందని మండిపడ్డారు. ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణన మొత్తానికి తప్పుల తడకగా మారిందని ఆరోపించారు. కులగణన సర్వే నివేదికలో ఎస్సీ, ఎస్టీ, బీసీల జనాభా తగ్గినట్టు, ఓసీల జనాభా పెరిగినట్టు చూపడం సరికాదన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం అధికారంలోని వచ్చిన ఆరు నెలలో బీసీ రిజర్వేషన్లను పెంచుతామని మాయమాటాలు చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ కులగణన సర్వేతో మోసం చేసింద్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్నికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని ధీమావ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నాయకులు నర్సింహులు, విఠల్, ధర్నుపవార్ పాల్గొన్నారు.

జర్నలిస్టు సత్యనారాయణకు నివాళి

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 6 : ప్రజా జర్నలిస్టు సత్యనారాయణ అందరికీ స్ఫూరిగా నిలిచారని ప్రజా సంఘాల నేతలు, జర్నలిస్టులు అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మాజీ ఎమ్మెల్సీ ఆర్ సత్యనారాయణ సంతాప సభ గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నేతలు, జర్నలిస్టులు నివాళులర్పించారు. అనంతరం సీనియర్ జర్నలిస్టు కొమురవెల్లి అంజయ్య, జర్నలిస్టు సంఘం జిల్లా అధ్యక్షుడు రంగాచారి, ప్రజా సంఘం నేత పోచబోయిన శ్రీహరి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్‌కుమార్, జర్నలిస్టులు అశోక్,రాజిరెడ్డి,సంఘాల నేతలుయదగిరి,శంకర్, పాపయ్య,శ్రీకాంత్,శంకర్,సంజీవ్,శేఖర్,శ్రీనివాస్,రాములు పాల్గొన్నారు.

నీలగిరి తోట దగ్ధం

చేర్యాల, ఫిబ్రవరి 6 : నిప్పు అంటుకొని నీలగిరి తోట దగ్ధమైన సంఘటన మండలంలోని ఆకునూరులో చోటు చేసుకుంది. గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కరెండ్ల రాజిరెడ్డికి గ్రామ శివారులో 6 ఎకరాల నీలగిరి తోట ఉంది. గురువారం సాయంత్రం నీలగిరి తోటకు నిప్పు అంటుకొని మంటలు ఎగిసి పడటంతో బూడిదైంది. నీలగిరి తోట ప్రమాదవశాత్తు అంటుకుందా... లేదా ఎవరైనా కావాలని నిప్పుపెట్టారా అని తెలియాల్సి ఉంది.

ప్యూరీఫైడ్ వాటర్ మిషన్ అందించడం అభినందనీయం

బెజ్జంకి, ఫిబ్రవరి 6: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు తోటపల్లికి చెందిన సిందిరి లక్ష్మణ్ జ్ఞాపకర్థం ఆతడి కుమారుడు శ్రవణ్‌కుమార్ ప్యూరీఫైడ్ వాటర్ మిషన్ అందించడం అభినందనీయమని సీఐ శ్రీనివాస్ అన్నారు. లక్ష్మణ్ తోటపల్లి ఆన్‌లైన్ రిజర్వాయర్ వద్ద వరదలో గల్లంతుకాగా పోలీసులు ఎంతో సహకరించారని, ఆయన జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన మిషన్‌ను సీఐ గురువారం ప్రారంభించారు. ఆయన వెంట ఎస్సై కృష్ణారెడ్డి, మురిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు అక్కరవేణి పోచయ్య, సిబ్బంది ఉన్నారు.

కోహీర్ తహసీల్దార్ బాలశంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

ప్రభుత్వ భూమిని కాపాడాలి

కోహీర్, ఫిబ్రవరి 6 : కోహీర్ పట్టణంలోని పట్లూర్ బేస్ కాలనీ సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడాలని గురువారం కోహీర్ తహసీల్దార్ బాలశంకర్‌కు స్థానికులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్కడ ఖాళీగా ఉన్న భూమిని వెంచర్‌లో కలిపేందుకు యత్నిస్తున్నారని వివరించారు. ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని వారు సూచించారు. వినతి పత్రం సమర్పించిన వారిలో పరమేశ్, అరుణ్, శ్రీను, ప్రేమ్, సందీప్, కృష్ణ, రాజు, చందు, మల్లేశ్ ఉన్నారు.

నులి పురుగులను నివారిద్దాం

దిగ్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమావేశంలో వైద్యాధికారులు

కోహీర్, ఫిబ్రవరి 6 : విద్యార్థులందరూ ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మండల వైద్యాధికారులు నవీన్ కుమార్, నరేందర్ కోరారు. గురువారం మండలంలోని దిగ్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయా గ్రామాల పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో జాకీర్ హుస్సేన్, ఎంపీహెచ్‌ఎస్ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఎం ఉన్నారు.

చెరుకు పంట దగ్ధం

జహీరాబాద్, ఫిబ్రవరి 6 : జహీరామాద్ నియోజకవర్గంలోని న్యాల్‌కల్ మండలంలోని హద్నూర్ ప్రమాదవశాత్తు చెలరేగిన మంటలకు చెరుకు పంటకు పూర్తిగా కాలిపోయింది. గ్రామస్తులు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు మల్లికార్జున్, బస్వరాజ్ కౌలు రైతు యాదుల్ చెరుకు పంట సాగు చేశారు. గురువారం ప్రమాదవశాత్తు పక్కపక్కనే పొలాల్లో సాగుచేసిన 11 ఎకరాల్లోని చెరుకు పంటకు నిప్పంటుకొని పూర్తిగా దగ్ధమైంది. ఆయా పొలాల్లోని చెరుకుతో పాటు డ్రిప్ పరికారాలు, ఇతర పైప్ లైన్ తదితర వస్తువులు పూర్తిగా కాలిపోయి దాదాపు రూ. 15 లక్షల వరకు నష్టం వాటిల్లిందన్నారు. సంఘటన స్థలాన్ని మండల రెవెన్యూ, వ్యవసాయాధికారులు సందర్శించారు. బాధిత రైతులను ప్రభుత్వ పరంగా అదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నీట మునిగి వ్యక్తి మృతి

పుల్కల్, ఫిబ్రవరి 6 : ప్రమాదవశత్తు నీట మునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని సింగూర్ ప్రాజెక్టులో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. సంగారెడ్డి పట్టణంలోని ప్రగతి నగర్‌కు చెందిన మహ్మద్ మౌలానా(60)సింగూర్ ప్రాజెక్టు చూసేందుకు వచ్చి సింగూర్ డ్యామ్ కింది భాగంలో స్నానం చేసేందుకు ఈతకు వెళ్లి నీటిలో మునిగి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డీసీసీబీ బ్యాంక్ సందర్శన

నారాయణఖేడ్, ఫిబ్రవరి 6 : నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి గురువారం స్థానిక డీసీసీబీ బ్యాంకును సందర్శించారు. ఇందులో భాగంగా భవనాన్ని పరిశీలించి సిబ్బందితో చర్చించారు. నారాయణఖేడ్‌లో బ్యాంకు ఏర్పాటైనప్పటి నుంచి బ్యాంకు అద్దె భవనంలోనే కొనసాగుతుండటంతో అప్పట్లో తాను ప్రతిపాదించిన మేరకు సీఎం కేసీఆర్ హయాంలో అన్ని హంగులతో బ్యాంకును సొంత భవనాన్ని నిర్మించినట్లు గుర్తు చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ వెంకటేశంతో పాటు బ్యాంకు సిబ్బంది మాజీ ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. మాజీ ఎమ్మెల్యే వెంట నాయకులు వెంకటేశం, విజయ్, పవన్ పాటిల్, సుధాకర్ ఉన్నారు.



ఖేడ్ డీసీసీబీ బ్యాంక్‌ను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

రేపు సంస్మరణ సభ

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 6 : తెలంగాణ ఉద్యమకారుడు, స్వర్గీయ మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ సంస్మరణ సభను 8న సాయంత్రం 5 గంటలకు స్థానిక బైపాస్ రోడ్డులోని యోగ భవన్‌లో గురువారం నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బీరయ్య యాదవ్ తెలిపారు. పార్టీలు, సంఘాలకు అతీతంగా హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.